## కరీంనగర్ సర్కిల్ ఎస్ఈగా రమేశ్‌బాబు


ఎస్ఈ రమేశ్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ముకరంపుర, నవంబర్ 7 : ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరింగ్‌గా ఎం రమేశ్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఎన్పీడీసీఎల్ సీఎండీ బుధవారం రాత్రి పలువురు ఎస్ఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన ఎస్ఈ రమేశ్‌బాబు ఇంత వరకు కామారెడ్డి జిల్లా ఎస్ఈగా విధులు నిర్వర్తించారు. గతంలో కరీంనగర్‌లో పని చేసిన అనుభవంతో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సత్వర సేవలు అందించేలా కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఈని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం(టీఆర్వీకేఎస్) నాయకులతో పాటు పలు యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్ల ఆహ్వానం

కలెక్టరేట్, నవంబర్ 7 : 2024 సంవత్సర ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డులకు నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్యపర్చడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించగా, ఉత్తమ ఓటరు అవగాహన ప్రచారాన్ని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని, ప్రింట్ మీడియా, టెలివిజన్ మీడియా, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎన్నికల సాంకేతిక అంశాలను ప్రచారం చేయడం లాంటి విభాగాల్లో ప్రాధాన్యతనిచ్చిన మీడియా సంస్థలను గుర్తించడమే ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమన్నారు. జనవరి 25న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు స్పష్టం చేశారు. పచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజాపరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు, తదితర అంశాల ఆధారంగా అవార్డులకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 10 లోపు తమ సిఫార్సును రాజేశ్‌కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్స్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక్‌రోడబ్, న్యూఢిల్లీ–110001 చిరునామాకు పంపించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

## సీఎంను కలిసిన పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి

కార్పొరేషన్, నవంబర్ 7: టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ సమద్ నవాబ్ గురువారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఆయనకు ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 11న కరీంనగర్‌లో తన కుమారుడు ఎంఎం అలీమ్ నవాజ్ వివాహ వేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు.


సీఎంను ఆహ్వానిస్తున్న సమద్


**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch I issue the following notice to general public. My client intends to grant to loan to title Thirunahari Saritha, W/o. Raju, Age: 39 years, Occ: House hold, R/o. H.No. 3-48/1, Athmakur village and mandal of Hanamakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice other wise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Huzurabad municipality limits, the survey number 139/G, 139/I, 143, plot number 12, eastern side part of vacant place to the constructed RCC slab house bearing number 19-39/6, to an extent of 100.09 Square yards its equivalent to an extent of 83.68 Square meters, in which a constructed RCC slab house was to an extent of 610.19 Square feets and open place to an extent of 32.30 Square yards, within the boundaries
North: Part of plot belongs to Bingi Srilatha vide Plot No. 5
South: 18' feets width Road (30' feets with proposal road)
East: Plot of Bingi Ravi Kumar vide Plot No. 11
West: Remaining plot Vidapu Roja vide Plot No. 12
Is situated at Huzurabad village and mandal of Karimnagar dist
Date: 07-11-2024
Sd/- G. LAXMANA MURTHY, Advocate
Huzurabad. Cell No. 94403 69866



నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED HELPERS

jobs Apply Now!

★ హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు "హెల్పర్లు" కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం||లు.
No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189


## సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- వందల కోట్లతో నగరాభివృద్ధి
- మేయర్ సునీల్‌రావు


పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 7 : నగరవ్యాప్తంగా రూ.12 వందల కోట్లతో ప్రజల సమస్యలన్నీ పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం 35వ డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్ 3లో రూ. 25 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నగరపాలక సంస్థకు సరిగా నిధులు రాక చాలా సమస్యలు తిష్టవేసి, ప్రజలకు ఇబ్బందిగా మారాయన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతా గడిచిన పదేళ్ల కాలంలో వందల కోట్ల రూపాయలు నగరపాలక సంస్థ రావడంతో 35వ డివిజన్‌తో పాటు నగరంలోని చాలా డివిజన్లు అభివృద్ధి చెందాయన్నారు. 35వ డివిజన్ సప్తగిరి కాలని, శ్రీనగర్‌కాలనీల్లో వర్షం పడితే వరద ఇండ్లలోకి చేరే పరిస్థితి ఉండేదని గుర్తుజేశారు. అలాంటి పరిస్థితుల్లో నగరపాలక సంస్థ ద్వారా డివిజన్‌కు వందల కోట్లు కేటాయించి అన్ని కాలనీలను చక్కటి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో అభివృద్ధిచేశామన్నారు. డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్ నిర్మాణం చేశామని, విద్యుత్ బిల్లుల కౌంటర్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. తమ పాలకవర్గం హయాంలో వందల కోట్ల రూపాయల నిధులు తెచ్చి నగరంలో అన్ని డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, స్మార్ట్‌సిటీ నిధులు, ప్రజల నుంచి పన్నుల ద్వారా వచ్చిన నిధులతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేసి నగర రూపు రేఖలు మార్చామన్నారు. బయటి ప్రాంతం నుంచి వచ్చిన ప్రజలు కరీంనగర్ గొప్పగా అభివృద్ధి చెందడాన్ని చూసి చాలా ఆశ్చర్య పోతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం డివిజన్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామని ప్రతి ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు కోట్ల రూపాయల నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మానం చేశామన్నారు. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్‌లో కూడా సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే 3 నెలల్లో పాలకవర్గ పాలనలో పెండింగ్ సమస్యలు ఏమున్న పరిష్కరించి, ప్రజలకు కావాల్సిన సదుపాయాలు వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, వాల రమణరావు, నాయకులు ఎడ్ల అశోక్, డివిజన్ వాసులు ఆనందం, లక్ష్మీరాజం, దాదారెడ్డి, నర్సయ్య, పద్మ, రమేశ్ రాథోడ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## జిల్లాను పోషకాహారలోప రహితంగా తీర్చిదిద్దాలి

**టీఎఫ్‌సీ సభ్యులు ఆనంద్, భారతి**


మాట్లాడుతున్న ఆహారకమిషన్ సభ్యుడు ఆనంద్

విద్యానగర్/కలెక్టరేట్, నవంబర్ 7 : బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా జిల్లాను పోషకాహార లోప రహితంగా తీర్చిదిద్దాలని, తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, భారతి పిలుపునిచ్చారు. జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, పాఠశాలలు, గురుకులాలు సందర్శించినట్లు తెలిపారు. ప్రతి రేషన్‌దుకాణానికి బోర్డు, ఫిర్యాదుల పెట్టె, డీలరు, అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. కలెక్టర్ చేపట్టిన శుక్రవారం సభ జిల్లాలో సత్ఫలితాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆహార సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను దేశించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ లో అందుతున్న ఫలితాలను పరిశీలించి, విలువైన సలహాలు, సూచనలు అందించిన ఫుడ్ కమిషన్ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీవో కే మహేశ్వర్, డీఆర్డీవో శ్రీధర్, డీడబ్ల్యూవో సరస్వతి, డీఈవో జనార్దన్, డీఎంహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.

**కొత్తపల్లి పీహెచ్‌సీని సందర్శించిన ఫుడ్ కమిషన్ సభ్యులు**

కొత్తపల్లి, నవంబర్ 7 : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను గురువారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భారతి సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జాతీయ ఆహార భద్రత చట్టం–2013 ఎలా అమలు జరుగుతుందో వైద్యాధికారి నాజీయా ఫాతిమాను, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు సుజాత, సన జవేరియా, మౌనిక, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామడుగు, నవంబర్ 7 : రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు సుశాంత్, శశివర్ధన్ ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో చక్కని ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8,9,10వ తేదీల్లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో సుశాంత్, శశివర్ధన్ పాల్గొంటారు. దీనిలో భాగంగా అల్ఫోర్స విద్యాసంస్థల చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

గన్నేరువరం, నవంబర్ 7 : పౌష్టికాహారం అందించడమే ఆహార భద్రత కమిషన్ లక్ష్యమని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి గ్రామాల్లో గురువారం రేషన్ షాప్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలను ఫుడ్ కమిషన్ సభ్యురాలు భారతి, అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గునుకుల కొండాపూర్‌లో రేషన్ షాప్ నిర్వహణ సరిగా లేదన్నారు. జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ వివరాలు, జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆహార భద్రత కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర రావు, డీఈవో జనార్దన్ రావు, డీఎస్‌వో నర్సింహారావు, డీఎం రజినీకాంత్, డీఆర్డీవో శ్రీధర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, తహసీల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

## చింతకుంటలో కొండచిలువ కలకలం

కొత్తపల్లి, నవంబర్ 7 : మండలంలోని చింతకుంట గ్రామంలో గురువారం రాత్రి కొండ చిలువ కలకలం సృష్టించింది. చింతకుంట గ్రామంలోని రాజీవ్‌నగర్‌లో సమీప చెట్ల పొదల నుంచి వచ్చిన ఓ కొండ చిలువ ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించింది. వెంటనే ఇళ్లలోని వారు అప్రమత్తమై పాములు పట్టే వారికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి పట్టుకొని సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో వదిలిపెట్టడంతో రాజీవ్‌నగర్ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

## హాస్టల్ భవనాలను నిర్మించాలని వినతి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 7: నియోజకవర్గంలో బీసీ బాలబాలికల హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉన్నాయని, వాటిని సొంత భవనాలకు మార్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల అధ్యక్షుడు దోమ్మాటి వేణుగోపాల్, మండల సహాయ కార్యదర్శి రాంపెల్లి రోహిత్ పాల్గొన్నారు.

## పరిహారం రాని భూముల పరిశీలన

శంకరపట్నం, నవంబర్ 7: మండలంలోని తాడికల్, కేశవపట్నం, మొలంగూర్, కొత్తగట్టు గ్రామాల శివారుల గుండా జాతీయ రహదారి–563 విస్తరణకు సర్కారు భూములు సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం కూడా చెల్లించగా, పలు కారణాలతో పలువురు రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. ఈ విషయంలో ఆయా రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో గురువారం హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు కొత్తగట్టుకు వెళ్లి పరిహారం అందని రైతుల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ సర్వే నంబర్లలో పరిహారం అందని 15 మంది రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అందరికీ పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వెంట డీఐ అక్బల్, తహసీల్దార్ బత్తుల భాస్కర్, సర్వేయర్ రాజేంద్రప్రసాద్, గిర్దావర్ బాలకిషన్, రైతులు ఉన్నారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి పరామర్శ

రామడుగు, నవంబర్ 7 : మండలంలోని వెదిర గ్రామానికి చెందిన సాక్షి విలేకరి వంచ రాజిరెడ్డి మాతృమూర్తి సుగుణమ్మ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. సుగుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఓటర్ లిస్టులపై ఆర్డీవో సమీక్ష

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 7: పట్టణంలోని వివిధ పార్టీల నాయకులతో హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు ఓటర్ లిస్టులపై సమీక్షా సమావేశం గురువారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులకు ఈ నెల 28 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జనవరి 6న ఫైనల్ ఓటర్ లిస్టులో పేరు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తూర్పాటి రాజు, సొల్లు బాబు, రాజేశం పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలపై అవగాహన

జమ్మికుంట, నవంబర్7: ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక స్రవంతి జూనియర్ కాలేజీలో డ్రగ్స్, గంజాయి పదార్థాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సీఐ మాధవీలత హాజరై మాట్లాడారు. యువత్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

### షీ టీం పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, నవంబర్ 7: కమిషనరేట్ పోలీసు కార్యాలయంలో రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ జారీ చేసిన టీజింగ్, ర్యాగింగ్, వర్క్ ప్లేస్ హరాస్మెంట్‌కు సంబంధిత వాల్ పోస్టర్‌ను గురువారం అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఉమెన్ పోలీస్ స్టేషన్, షీటీం ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఏసీపీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 12లోగా పనులు పూర్తి చేయాలి

కార్పొరేషన్, నవంబర్ 7 : నగరంలోని కళాభారతిలో చేపడుతున్న మరమ్మతులు ఈ నెల 12లోగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కళాభారతిలో చేపడుతున్న మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చాహత్ భజ్‌పాయ్, అదనపు కమిషనర్ సువార్త, మున్సిపల్ ఎస్ఈ రాజ్‌కుమార్, డీఈ ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

### పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

తిమ్మాపూర్, నవంబర్7 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 27న కరీంనగర్ నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం వరకు నిర్వహించనున్న మహాపాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. ఉద్యమకారుల ఫోరం నాయకులు కనకం కుమారస్వామి, ప్రసన్న, రేణుకక, అంకూస్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కరీంనగర్ రూరల్: నవంబర్ 7: కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ జడ్పీ ఉన్నత పాఠశాలలోని 63 మంది పదో తరగతి విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ జగదీశ్వర్, దుర్శేడ్, ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజన్న, సరితారాణి, శైలజ, మంజుల, ప్రకాశ్, బాబు, శ్రీలత. లత. శారధ, ప్రమీల, పీడీ రమేశ్ పాల్గొన్నారు.

### న్యాయవిజ్ఞాన సదస్సు

గన్నేరువరం, నవంబర్7 : జాతీయ న్యాయ సేనాధికార సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోక్సొ సైబర్ క్రైమ్, వాహనాల చట్టం, మొబైల్ ఫోన్ వినియోగంతో నిర్వహించే అనర్థాలను సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ వివరించారు. చట్టాల పట్ల యువత విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ సదానందం, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అంజయ్య పాల్గొన్నారు.

### తెలంగాణ చిట్‌ఫండ్స్ ఫెడరేషన్‌లో జిల్లా వాసులు

విద్యానగర్, నవంబర్ 7 : తెలంగాణ చిట్‌ఫండ్ ఫెడరేషన్ ఎన్నికలు బుధవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమాండ్లు రాజిరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా చీటి సత్యనారాయణరావు, జోనల్ సెక్రటరీగా బోయినపల్లి నర్సింగరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రెంటాల రాజిరెడ్డి, కొండా వేణుమూర్తి, నామా రామ్మోహన్‌రావు, శ్రీనివాస్, ఎల్లంకి రంజిత్‌కుమార్, మద్ది సమ్మయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ సమస్యలపై కృషి చేస్తామన్నారు. వారి ఎన్నికపై కరీంనగర్ ఉమ్మడి జిల్లా రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏవోగా అహ్మద్..


ఆర్డర్ కాపీని తీసుకుంటున్న అహ్మద్

విద్యానగర్, నవంబర్ 7 : తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతిపై జగిత్యాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అహ్మద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బుధవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగోన్నతులు నిర్వహించి, కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లికి పుల్లెల సుదీర్‌ను, సిరిసిల్లకు నాగరాజును, జగిత్యాలకు రమేశ్‌ను కోరుట్లకు కుతుబుద్దీన్‌కు కమిషనర్ దట్ రాజుకుమార్ ఉత్తర్వులు అందజేశారు. కరీంనగర్‌లో డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్‌ను అహ్మద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## గంగిపల్లిని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

మానకొండూర్ రూరల్, నవంబర్ 7 : మండలంలోని గంగిపల్లిలో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాలు, జాతీయ పశుగణన కార్యక్రమాన్ని డాక్టర్ సుష్మిత, డాక్టర్ అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ సందర్శించి, టీకాలు, పశుగణనను పరిశీంచి, వివరాలు నమోదు తీరును పరిశీలించారు. అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, సిబ్బంది రఫీ, విజయలక్ష్మి, సంధ్య, కనకయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## యాసంగి పంటల ప్రణాళికపై అవగాహన సదస్సు

కొత్తపల్లి, నవంబర్ 7 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం యొక్క వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన మండలంలోని నాగుల మల్యాల గ్రామంలోని బద్దిపల్లి రైతు వేదికలో గురువారం యాసంగి పంటల ప్రణాళికపైన అవగాహన సదస్సు నిర్వహించారు. దత్తత గ్రామ ఇన్‌చార్జి పీ మధుకర్‌రావు ఆరుతడి పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం మక్కజొన్న చిరుసంచులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 7 : మండలంలోని ఆసీఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గుగులోత్ అనిత ఎస్జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు బీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాలలో నిర్వహించిన 68వ ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న అనిత ప్రతిభ చూపి ఈ నెల 15 నుంచి మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు వాసంతి, శివకుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజెలీన్, గంగాచారి, నాగవేణి, సంతోష్ గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

### ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు


లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

మానకొండూర్ రూరల్, నవంబర్ 7 : మండలంలోని ఊటూర్‌లోని ఇసుక రీచ్ నుంచి అధిక లోడ్‌తో లారీలు వెళ్తయని, దీంతో రోడ్డు గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో గురువారం రాత్రి ఊటూర్‌కు చెందిన యువకులు, గ్రామస్తులు లారీలను అడ్డుకున్నారు. రోడ్డు మరమ్మతులు చేయించాలని ఆందోళన చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముకరంపుర, నవంబర్ 7: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం 11కేవీ ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్, బాలాజీ నగర్, గణేశ్‌నగర్, తిరుమల నగర్, దోబీ ఘాట్, విశాల్ మార్ట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు. 11కేవీ తీగలగుట్టపల్లె ఫీడర్‌లో కొత్త డీటీఆర్ భిగింపు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరస్వతీనగర్, విద్యారణ్యపురి, హనుమాన్‌నగర్, మాణికేశ్వరి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు తెలిపారు.

## ఉజ్వల పార్కుకు 'వెలిచాల' పేరు పెట్టాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతల వినతి**

రాంనగర్, నవంబర్ 7: కరీంనగర్ ఉజ్వల పార్కుకు తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు పేరు పెట్టాలని కాంగ్రెస్ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి సరిల్ల రతన్ రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గండి రాజేశ్వరరావు పలువురు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ నగర పరిధిలో జగపతిరావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు 20 గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో జగపతిరావు కరీంనగర్‌లో అడవుల శాతం తక్కువగా ఉన్నందున లోతైన ఆలోచన చేసి, ఉజ్వల పార్కు ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేశారని తెలిపారు.

## కార్మిక సంక్షేమమే మజ్దూర్ యూనియన్ ధ్యేయం

జమ్మికుంట, నవంబర్7: కార్మిక సంక్షేమమే మజ్దూర్ యూనియన్ ధ్యేయమని, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అలుపెరుగని పోరాటాలు చేస్తున్నామని ఎస్సీఆర్ఎంయూ డివిజన్ కార్యదర్శి పిల్లల మర్రి రవీందర్ పేర్కొన్నారు. గురువారం ఆయన భారతీయ రైల్వే దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో జమ్మికుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. నిర్వహించనున్న ఎన్నికల్లో ఎస్సీఆర్ఎంయూను గెలిపించాలని కోరారు. సంఘం నాయకులు శ్రీనివాస్, రాజయ్య, సాంబరాజు, మొండయ్య, స్వప్న, శివ, క్రాంతి తదితరులున్నారు.

## శూద్ర హిందీ అనువాద కథల పుస్తకావిష్కరణ

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 7: ఉపాధ్యాయుడు, రచయిత ఇమ్మడి సంపత్ కుమార్ అనువాదించిన శూద్ర హిందీ కథల పుస్తకాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చింతకింది కాసీం మాట్లాడుతూ.. యదార్థ జీవిత ఇతివృత్తం ఉంటేనే చదివే పాఠకులను ఆకట్టుకుంటుందని, సంపత్ రచనలు సామాజిక స్పృహ కలిగినవని అభినందించారు. సభలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, న్యాయవాది ముక్కెర రాజు, డీటీఎఫ్ నాయకులు పలకల ఈశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకటరాజం, ప్రొఫెసర్ శేఖర్, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, సదానందం, ఇమ్మడి బాబు, రహీం, శనిగరం బాబ్జి, రొంటాల బుచ్చయ్య, హరిబాబు, అమరేందర్ పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్‌కు సన్మానం

రామడుగు, నవంబర్ 7: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు బదిలీపై వచ్చిన మనోజ్ ప్రిన్స్‌పాల్‌గా బాధ్యతలు చేపట్టగా, గురువారం పలువురు నాయకులు, యువకులు మనోజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరి రాజయ్య, నేషనల్ హ్యూమన్‌రైట్స్ సామాజిక సేవ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు జెట్టిపల్లి అనిల్‌కుమార్, రామడుగు మండల మాల మహానాడు సంఘం అధ్యక్షుడు పల్లాటి చంద్రయ్య, కరాటే మాస్టర్ క్యాస రాజశేఖర్ ఉన్నారు.

## విచారణ చేపట్టిన త్రిసభ్య కమిటీ

కార్పొరేషన్, నవంబర్ 7: మున్సిపల్ కమిషనర్ పై 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత భర్త మండి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ప్రమేల సత్పతి నియమించిన త్రిసభ్య కమిటీ గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో విచారణ చేపట్టింది. ఈ మేరకు ఫిర్యాదు దారుడు శ్రీలత చంద్రశేఖర్‌తో పాటు పలువులను సాక్షులను విచారించి, వారి వాగ్మూలాలను నమోదు చేసుకున్నారు.

## దవాఖాన సిబ్బంది భద్రతకు కమిటీల ఏర్పాటు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 7: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో సిబ్బంది భద్రతా విషయంలో ప్రభుత్వ సూచనల మేరకు.. కమిటీలను గురువారం ఏర్పాటు చేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి తెలిపారు. దవాఖాన సెక్యూరిటీ కమిటీ చైర్ పర్సన్‌గా రాజేందర్ రెడ్డి, కన్వీనర్‌గా ఆర్ఎంవో సుధాకర్ రావు, సభ్యులుగా హుజూరాబాద్ టౌన్ సీఐ జీ తిరుమల గౌడ్, బయో మెడికల్ ఇంజినీర్ శ్రీ కృష్ణ, కృప, ఆలేటి శ్రీరామ్, డాక్టర్ ఏ సుధాకర్, డాక్టర్ నారాయణరెడ్డి నియమించారు. ఏరియా ఆసుపత్రి వైలెన్స్ ప్రివెన్షన్ కమిటీ చైర్మన్‌గా సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, కన్వీనర్‌గా డీఎంవో డాక్టర్ పీ ప్రసాద్ రావు, సభ్యుడిగా డాక్టర్ ఎం సుధాకర్ రావు, టౌన్ సీఐ జీ తిరుమల గౌడ్, డాక్టర్ సోమశేఖర్, రవీందర్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు తాడికల్ విద్యార్థి అభిలాష్

శంకరపట్నం, నవంబర్ 7 : మండలంలోని తాడికల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పావురాల అభిలాష్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 2న హుజూరాబాద్‌లో నిర్వహించిన అండర్–14 విభాగంలో అభిలాష్ ప్రతిభ చూపారు. 68వ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నవంబర్ 7–8 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్ గ్రామంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. అభిలాష్ ఎంపికపై ఎంఈవో, హెచ్ఎం లక్ష్మీనారాయణ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కొర్మి మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

## శ్రీ చైతన్య విద్యార్థులు..

తిమ్మాపూర్, నవంబర్7: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య డిఫెన్స్, స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న అండర్–17 బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి సూచించారు. విద్యార్థులను చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి, పీడీ లెంకల శ్యాంసుందర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు.

## ప్రవేశ ఫలితాల్లో ప్రతిభ చూపిన శ్రీనివాస్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 7 : రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన నేతాజీ సుభాష్ ఓపెన్ ప్రభుత్వ యూనివర్సిటీ కలకత్తా మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్య మేధోపరమైన, అభివృద్ధి వైకల్యాలు జాతీయ స్థాయి ప్రవేశ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ప్రవేశ ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన ప్రముఖ రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్ అట్ల శ్రీనివాస్ రెడ్డి ప్రతిభ చూపారు. మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్య మేధోపరమైన, అభివృద్ధి వైకల్యాలు ప్రవేశ ఫలితాల్లో శ్రీనివాస్ రెడ్డి జాతీయ స్థాయి జనరల్ మెరిట్ 11 ర్యాంకు సాధించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దూర విద్యా విధానంలో మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్య మేధోప రమైన, అభివృద్ధి వైకల్యాలు కోర్సును రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన ఏకైక యూనివర్సిటీ నేతాజీ సుభాష్ ఓపెన్ యూనివర్సిటీ అన్నారు. ఇందులో మొత్తం 30 సీట్ల భర్తీకి గాను 1:2 విధానంలో 57 మందికి తేదీ 11 నవంబర్ సోమవారం యూని వర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని సైకాలజిస్ట్ దేదీప్య, సొరుపాక ఐలయ్య, భాస్కర్, రమేశ్ అభినందించారు.

## 'ఎమ్మెల్యే గడ్డం వివేక్ క్షమాపణ చెప్పాలి'

తెలంగాణచౌక్, నవంబర్ 7 : నేతకాని కులాన్ని మాలనేతకాని కులంగా మార్చాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ చేసిన వ్యాఖ్యలను ఉపసహంరించుకొని, నేతకాని కులస్తులకు క్షమాపణ చెప్పాలని నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం మారుతి డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌భవనంలో గురువారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మంగళవారం గడ్డం వివేక్ ఒక చానల్ మాట్లాడుతూ నేతకాని కులాన్ని మాలనేతకాని కులంగా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టి తీసుకెళ్తానని వాఖ్యానించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వాఖ్యలతో నేతకాని కులస్తులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నేతకాని కులాన్ని అలాగే ఉంచాలని ఎలాంటి మార్పులు చేయొద్దని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నాయకులు కనుకయ్య, బాలకిషన్,మోహన్ పాల్గొన్నారు.